క్లుప్తంగా

నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా వేసే గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం మంగళవారం ప్రారంభమవుతుందని మండల పశువైద్యాధికారి అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి వచ్చే నెల 14 వరకు నెలరోజుల పాటు గ్రామాల వారీగా గాలికుంటు నివారణ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతీ రోజు ఆరు టీమ్‌ల ద్వారా గ్రామాల్లో పర్యటించి పాడి పశువులకు టీకాలు వేస్తామన్నారు. మండలంలోని పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

కమ్యూనిటీహాల్ పరిశీలన



తుక్కుగూడ: మున్సిపాలిటీలోని 10వ వార్డులో అసంపూర్తిగా ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్‌ను ఆ వార్డు కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో మున్సిపల్ నుంచి నిధులు కేటాయించి హాల్ నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్ నాగరాజును సన్మానిస్తున్న కార్పొరేటర్ అనిల్‌యాదవ్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో గణేశ్ ఉత్సవాలు, దేవీ శరన్నవరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా సోమవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు విధులు నిర్వహించారని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో నిరంతరం నిఘా ఉంచారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత బోచుపల్లి జంగయ్య(60) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి సోమవారం జంగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.12వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, యాదయ్య, తిరుపతయ్య, సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నూతన గ్రామ కమిటీ

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో పద్మశాలి గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయంలో పద్మశాలి సభ్యులందరూ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుక్కుడాల మల్లేశ్, ఉపాధ్యక్షులుగా ఏలె రమేశ్, కాడిగె మధు, పల్లాటి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా గణేష్, సహాయ కార్యదర్శులుగా రాకేష్, శశికుమార్, ముఖ్య సలహాదారులుగా పాండయ్య, జనార్దన్, వీరేశలింగం, శివరాజు మిగతా కార్యవర్గంలో పలువురిని ఎన్నుకున్నారు.

ఆగుతూ.. సాగుతూ..

అర్ధంతరంగా నిలిచిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

- పిల్లర్ల దశలోనే దర్శనమిస్తున్న వైనం
- రైల్వే గేటుతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పిల్లర్ల దశలోనే బ్రిడ్జి నిర్మాణం

షాద్‌నగర్: రైళ్ల రాకపోకలతో ప్రయాణికులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. మాటిమాటికి గేటు వేస్తుండటంతో వాహనాలు తరచూ గేటు వద్ద ఆగిపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు ఇబ్బంది పడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. కానీ ఆ పనులు పలు కారణాలతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రైల్వే గేటుతో తప్పని తిప్పలు

షాద్‌నగర్ మీదుగా ప్రతీ రోజు సుమారు ఇరవై రైళ్ల రాకపోకలు కొనసాగిస్తుంటాయి. పట్టణంలోని చటాన్‌పల్లి, కేశంపేట రోడ్డులో రైల్వే గేట్లు ఉన్నాయి. చటాన్‌పల్లి రైల్వేగేటు మీదుగా చటాన్‌పల్లి, బివిరావునగర్, బుచ్చిగూడ, కొండన్నగూడ, వెల్జర్ల, సంగెం, కొత్తపేటకు చెందిన వేలాదిమంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా వాహనదారులు జాతీయ రహదారి బైపాస్ నుంచి షాద్‌నగర్ పట్టణంలోని నుంచి వికారాబాద్, పరిగి వెళ్లాలన్నా చటాన్‌పల్లి రైల్వే గేటును దాటి రావాల్సి ఉంటుంది. దీంతో అనునిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలతో ఈ రహదారి ఎంతో రద్దీగా ఉంటుంది. తరచూ గేటు వేస్తుండటంతో వందల సంఖ్యలో వాహనాలు రైల్వేగేటు వద్ద ఆగిపోతున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితులలో గేట్లను దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గేటు తీసిన తర్వాత కూడా వాహనాలు అన్నీ ఒకేసారి ముందుకు కదులుతుండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పలుమార్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి నిధులు మంజూరు చేయించారు.



గేటు వేయడంతో నిలిచిన వాహనాలు

ఇదీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా

చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయం రూ.95కోట్లు కాగా ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.61.31కోట్లు మంజూరు చేసి పరిపాలన అనుమతులు జారీ చేయడంలో పనులు ప్రారంభమయ్యాయి.

నిలిచిన పనులు

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పిల్లర్లను నిర్మించారు. గత ప్రభుత్వ హయంలో డిజైన్ చేసిన విధానంలో కాకుండా వై జంక్షన్ బ్రిడ్జి నిర్మించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్యలు చేపట్టారు. గతంలో డిజైన్ చేసిన విధంగా బ్రిడ్జిని నిర్మిస్తే వాహనదారులకు ఇబ్బందులు తప్పవనే ఉద్దేశంతో వైజంక్షన్ బ్రిడ్జిని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గత కొన్నినెలలుగా నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కొందుర్గు పర్యటనకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అదనంగా రూ.89కోట్లు మంజూరు చేయాలని కోరారు.

పనులు ప్రారంభించాలి



బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అధికారులు వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలి. షాద్‌నగర్ పట్టణానికి బైపాస్ నుంచి అన్నారం వైజంక్షన్ మీదుగా రావాల్సి వస్తోంది. – శ్రీకాంత్, షాద్‌నగర్

తరచూ గేటు పడుతుండటంతో..



చటాన్‌పల్లి గ్రామానికి, బైపాస్‌రోడ్డుకు వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ గేటు వేస్తుండటంతో గంటల తరబడి గేటు వద్ద నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలి – శివకుమార్, షాద్‌నగర్

సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు ఔటర్ ఎగ్జిట్ వద్ద ఉన్న నాయకులు

భారీ ర్యాలీగా తరలివచ్చిన నాయకులు

మహేశ్వరం: కొంగరకలాన్ ఫ్రాక్స్‌కాన్ కంపెనీ పనులను పరిశీలించడానికి విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రావిర్యాల ఔటర్‌రింగ్ ఎగ్జిట్ 13 వరకు భారీ ర్యాలీగా చేరుకొని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు ఘన స్వాగతం పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఔటర్ దిగగానే కేఎల్లార్‌తో పాటు నాయకులు కలిసి కాంగ్రెస్ కండువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొక్క జంగారెడ్డి, ఎర్రవాపు ఇశ్రాయేల్, కాకి ఈశ్వర్, కృష్ణనాయక్, రాజునాయక్, లచ్చానాయక్, జానకీరామ్, జైపాల్‌రెడ్డి, రాజు, రంజిత్‌కుమార్, మురళీధర్‌రెడ్డి, లాజర్, పాండురంగారెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

ఎంపీ కొండాను కలిసిన నాయకులు



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: పట్టణ బీజేపీ నాయకులు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీతో పార్టీ సభ్యత్వ నమోదు విషయాలపై వారు చర్చించారు. ఎంపీని కలిసిన వారిలో యువ నాయకుడు డాక్టర్ ఎం.వైభవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మానిక్యరెడ్డి, నాయకులు శ్రీశైలంయాదవ్, కె.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పేదలను విస్మరించిన ప్రభుత్వాలు

- ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర సర్కార్లు విఫలం
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి



మాల్‌లో జెండావిష్కరణ చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

యాచారం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని మాల్ గ్రామంలో సోమవారం గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జెండావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నరేంద్రమోదీ ప్రభుత్వం మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తూ పేదల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనుల మీద దాడులు పెరిగిపోయినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోయిందన్నారు. పేదలకు ఇంటి స్థలాలు, ధరణి భూ సమస్యలు, కార్మికులకు సరైన గుర్తింపు లేకపోవడం వంటి సమస్యలపై దృష్టి పెట్టడం లేదని అన్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. పేదలకు అండగా ఉండేది సీపీఎం పార్టీయేనని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం నేటి నుంచే కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పార్టీ సీనియర్ నాయకుడు కానమోని యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో నూతన మాల్ గ్రామ శాఖ కార్యదర్శిగా బట్టు సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు చందునాయక్, గిరి, సాయికుమార్, రాములు, యాదయ్య, సుదర్శన్, శివాని, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● బైక్ జారిందా.. అంతే!



రోడ్డుపైనే పేరుకుపోయిన మట్టి

తుర్కయంజాల్: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సాగర్ రహదారిపై ఇసుక, మట్టి పేరుకుపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా మూడు లైన్‌ల రహదారి కాస్తా.. రెండు లైన్‌ల రోడ్డుగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డుపైకి నీటితో పాటు ఇసుక, మట్టి కొట్టుకువచ్చి పేరుకుపోయింది. వర్షాలు తగ్గుముఖం పట్టి పక్షం రోజులు గడుస్తున్నా అధికారులు శుభ్రం చేయించడం లేదు. దీంతో రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు జారీ కింద పడుతున్నారు. దీనికి తోడు దుమ్ము, ధూళి ముంచెత్తుతోంది. ఇప్పటికైనా అధికారుల స్పందించి వెంటనే రోడ్లను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌ను వివరణ కోరగా.. రోడ్డును వెంటనే శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చారు.

మహిళా సమాఖ్య భవనం నిర్మించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందిగామ: మండల పరిధిలోని బుగ్గోనిగూడ గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మహిళా సంఘం సభ్యులు, నాయకులు కోరారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు వారు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 10 మహిళా సంఘాల్లో 108 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో భవనంలేని కారణంగా వారు సమావేశాలు, ఇతర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు శ్రావన్, నర్సింహ, సాలయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, మహిళా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నాయకులు

శంకర్‌పల్లి: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో దుర్గామాత విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీనిని పలు హిందూ సంఘాలు తీవ్రంగా ఖండించి, ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. దీంతో శంకర్‌పల్లిలో సోమవారం బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో బీజేపీ శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్



కేఎల్లార్‌కు మొక్క అందజేస్తున్న శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను నిరంతరం పనిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తుక్కుగూడలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణం, అండర్ గ్రౌండ్, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, మరింత చెందుతుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందేవిధంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వం నియమిస్తుందన్నారు. అంతకు ముందు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లక్ష్మారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేనావత్ రాజునాయక్, జంగయ్య, ఏర్పుల శ్రీశైలం, గణేశ్, పరమేశ్, సేవ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. అమ్మవారి నిమజ్జనోత్సవం



చర్లపటేల్‌గూడలో అమ్మవారి చీర, ముక్కుపుడకను దక్కించుకున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చర్లపటేల్‌గూడలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనోత్సవం సోమవారం నిర్వహించారు. దూపదీప నైవేద్యాలతో నిత్యం పూజలందుకున్న దుర్గమ్మ చీరను మారమోని సత్యం యాదవ్ రూ.62 వేలకు, ముక్కుపుడకను పట్నం శ్రీశైలం రూ.38 వేలకు, లడ్డూను మారమోని నగేశ్‌యాదవ్ రూ.23 వేలకు వేలంలో దక్కించుకున్నారు.

ఆకట్టుకున్న మహిళల కోలాటం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆలయంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. మహిళల కోలాటం, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్థానిక సుర సముద్రం చెరువులో నిమజ్జనం చేశారు.

గ్రామీణ రోడ్లు ఛిద్రం



ధ్వంసమైన పెంజర్ల-మేకగూడ రోడ్డు

- సామర్థ్యానికి మించి భారీ వాహనాల రాకపోకలు
- ధ్వంసమైన దారులపై వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: రోడ్డు సౌకర్యం బాగుంటేనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తాయి. ఆస్పత్రులు, ఇతర అత్యవసర సమయాల్లో గ్రామాల నుంచి పట్టణాలకు చేరుకోవడానికి కూడా రోడ్డు సౌకర్యం చాలా అవసరం. కాగా మండలంలోని ఆయా గ్రామాల్లో రవాణా సౌకర్యం కోసం వేస్తున్న బీటీ, సీసీరోడ్లు భారీ వాహనాల రాకపోకల కారణంగా నిర్ణీత గడువుకు ముందే ధ్వంసమవుతున్నాయి. గడువు తీరక ముందే గుంతలమయంగా మారి దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

భారీ వాహనాలతోనే..

మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రస్తుతం పదుల సంఖ్యలో పరిశ్రమలు కొనసాగుతున్నాయి. పరిశ్రమలకు వెళ్లేందుకు ప్రత్యేక రోడ్లు లేని కారణంగా గ్రామాల్లోని ప్రధాన రోడ్ల గుండానే పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. కాగా పంచాయతీరాజ్ పరిధిలో నిర్మించే రోడ్లు సుమారు 20 నుంచి 30 టన్నుల సామర్థ్యంతో ఉండగా ఆ రోడ్లపై ప్రయాణిస్తున్న భారీ వాహనాల బరువు 40 నుంచి 50 టన్నుల వరకు ఉంటుంది. దీంతో రోడ్లు నిర్మించిన ఏడాదిలోపే ధ్వంసమవుతున్నాయి. రోడ్లు వేసిన కాంట్రాక్టర్ నిర్ణీత గడువు వరకు రోడ్ల నిర్వహణ చేపట్టాల్సి ఉన్నప్పటికీ భారీ వాహనాలు తిరుగుతుండడంతోనే రోడ్లు ధ్వంసమవుతున్నాయనే కారణంతో అలాగే వదిలేస్తున్నారు. ఇటీవల పెంజర్ల-మేకగూడ రోడ్డు, సిద్దాపూర్-ఏనుగుమడుగులతండాకు రూ.కోట్లతో వేసిన బీటీరోడ్లు భారీ వాహనాల రాకపోకల కారణంగా చాలాచోట్ల దెబ్బతిన్నాయి. వీటితో పాటు సిద్ధాపూర్-చింతగట్టుతండా, తీగాపూర్-జంగోనిగూడ రోడ్లు సైతం భారీ వాహనాల కారణంగా ధ్వంసమవుతున్నాయి.

రోడ్ల విస్తీర్ణం

కొత్తూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలు 18 అనుబంధ గ్రామాలు, తండాలు ఉన్నాయి. మండలంలో పంచాయతీరాజ్ పరిధిలో 55.29 కిలోమీటర్ల మేర బీటీ, 10.07 సీసీ రోడ్లు, మరో 15.62 కిలోమీటర్ల మేర మెటల్‌రోడ్లు ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ పరిధిలో సుమారు 43 కిలోమీటర్ల మేర బీటీరోడ్లు ఉన్నాయి.

నిర్వహణ లేక ప్రమాదాలు

ఎన్నో ఆందోళనలు, వినతుల మధ్య ఆయా గ్రామాలకు అధికారులు, పాలకులు రోడ్లను మంజూరు చేస్తున్నారు. కాగా రోడ్ల ఏర్పాటు తర్వాత సంబంధిత శాఖల అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదు. భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్లపై కంకరతేలి గుంతలమయంగా మారుతున్నాయి.గమనించకుండా వాహనదారులు ప్రయాణం సాగిస్తే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. దీనికి తోడు గుంతలమయంగా మారిన రోడ్లపై నుంచి అత్యవసర సమయాల్లో ఆస్పత్రులకు చేరుకోవడానికి సంబంధిత గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపాలి



గ్రామీణ ప్రాంతాల్లో వేస్తున్న బీటీరోడ్ల గుండా భారీవాహనాలు రాకపోకలు కొనసాగించకుండా అధికారులు ప్రత్యామ్నాయం చూపాలి. రోడ్ల సామర్థ్యానికి మించి వాహనాల బరువు ఉండడంతో ఏళ్ల పాటు మన్నికగా ఉండాల్సిన రోడ్లు ఏడాదిలోపే ధ్వంసమవుతున్నాయి.
– పానుగంటి పర్వతాలు, సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు

సామర్థ్యానికి మించిన వాహనాలతోనే..



పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న రోడ్లపై సామర్థ్యానికి మించిన వాహనాల రాకపోకలతో రోడ్లు చాలా వరకు ధ్వంసమవుతున్నాయి. సిద్ధాపూర్-ఏనుగుమడుగుతండాల మధ్యన స్టోన్ క్రషర్స్‌కు సంబంధించిన భారీ వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నాయి. వాటితోనే రోడ్డు చాలాచోట్ల గుంతలమయంగా మారింది. పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి వారి సూచనల మేరకు చర్యలు చేపడతాం.
– హేమంత్, పంచాయతీరాజ్‌ఏఈ, కొత్తూరు